సాక్షి
కాకినాడ
గురువారం । 8 । మే । 2025



ఆకాశ పందిరిలో..


స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి వధూవరులైన శుభ తరుణంలో రత్నగిరి పులకించింది. - 10లో



నిత్యాన్నదానానికి రూ.2.5 లక్షల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి నిత్యాన్నదానానికి త్సల్లా సుబ్రహ్మణ్యకృష్ణభాస్కర్–లక్ష్మీమానన దంపతులు (నరేంద్రపురం) రూ.2,50,000 విరాళంగా అందజేశారు.

1,987 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,987 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

జగన్‌ను కలసిన ముదునూరి



జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మురళీకృష్ణంరాజు

సాక్షిప్రతినిధి, కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులుగా నియమితులైన ప్రత్తిపాడు నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు బుధవారం తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల మీద నిరంతరం పార్లమెంట్ పరిశీలకులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని జగన్ సూచించారని మురళీకృష్ణంరాజు తెలియచేశారు. ఎప్పటికప్పుడు ప్రాంతీయ సమన్వయకర్తల సూచనలను కింది స్థాయికి తీసుకువెళ్లాలని చెప్పారన్నారు.

సచివాలయాల్లో మరో ఆరు సేవలు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో నూతన రైస్ కార్డుల నమోదుతో పాటు రైస్ కార్డులకు సంబంధించి మరో ఆరు సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బుధవారం నుంచి ప్రారంభించినట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నూతన రైస్ కార్డుల కోసం ఇప్పటి వరకూ అందిన దరఖాస్తులను, కొత్తగా పెట్టుకునే దరఖాస్తులను సచివాలయాల్లో ఏపీ సేవా ప్లాట్ ఫారమ్ ద్వారా నమోదు చేసేందుకు మండల, సచివాలయ సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. నూతన రైస్ కార్డుల నమోదుతో బాటు రైస్ కార్డుల విభజన, రైస్ కార్డులలో సభ్యులను చేర్చడం, సభ్యుల తొలగింపు, రైస్ కార్డు సరెండర్ చేయడం, కార్డులో చిరునామా మార్పు, తప్పుగా నమోదైన రైస్ కార్డు ఆధార్ సీడింగ్ సవరణ సేవల కోసం కూడా ప్రజలు సచివాలయాలను సంప్రదించవచ్చన్నారు.

ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్



కాకినాడ క్రైం: ప్రతిష్టాత్మక కాకినాడ రంగరాయ వైద్య కళాశాల 51వ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ ఎంసీ అనస్థీషియా హెచ్‌వోడీగా పనిచేసిన డాక్టర్ విష్ణువర్ధన్ తాజా పదోన్నతులలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఈ మేరకు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణువర్ధన్ మీడియాతో మాట్లాడుతూ కళాశాల సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా శ్రమిస్తానని అన్నారు. విద్యార్థులు, బోధకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందేలా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పీఈటీ సంఘ ఎన్నికలకు 6 నామినేషన్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు ఈ నెల 17న రాంకుమార్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ భవన్‌లో జరగనున్నాయి. ఈ ఎన్నికలకు నామినేషన్లు బుధవారం మధ్యాహ్నం అభ్యర్థులు దాఖలు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి పి.శ్రీనివాస్, జి.రవికొర్, ఉ.ఎం.హరిబాబు, కార్యదర్శి పదవికి వి.మాచరరావు, కేవీవీ నరసింహమూర్తి, కోశాధికారి పదవికి కె.నాగలింగేశ్వరరావు నామినేషన్లు వేశారు. శుక్రవారం సాయంత్రం లోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చునని రవిరాజు తెలిపారు. రాష్ట్ర పీఈటీ సంఘ మాజీ అధ్యక్షుడు జార్జి, సీనియర్ పీడీలు బంగారాజు, పట్టాభి, సునీల్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫైనల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: గత ఏడాది జనవరి 21వ తేదీన రంగరాయ వైద్య కళాశాల పరిధిలో విడుదల చేసిన పారామెడికల్ ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులు ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ లిస్టును పొందవచ్చు.

మాటలే మనోహరం!

- మద్దతు ఒట్టి మాటే
- రూ.1,200 మించి కొంటే ఒట్టు
- తేమ శాతమే పెద్ద ప్రతిబంధకం
- ఎక్కడి ధాన్యం అక్కడే
- పట్టించుకోని పాలకులు
- గగ్గోలు పెడుతోన్న రైతులు



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'మాటలు తీపిగా ఉంటాయి చేతలు చేదుగా ఉంటాయంటుంటారు. అదే నిజమని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మాటలు తేల్చాయి. రబీలో ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నాం. ప్రతి రైతుకూ కస్టమ్ మిల్లింగ్ ద్వారా కనీస మద్దతు ధర రూ.1,725 ఇస్తున్నామని మెట్ట ప్రాంతంలో రైతుల పొలాల్లో పర్యటించినప్పుడు ఆయన ఊదరగొట్టారు. రోడ్లు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశుల సాక్షిగా మంత్రి చెప్పిన మాటలు ఒట్టి బూటకమని జిల్లాలో రైతులు అంటున్నారు. జిల్లాలో అకాల వర్షాలతో తడిసి ముద్దయిన ధాన్యం కొనుగోలు అంటేనే పెద్ద మాయగా మారిందని రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. తడిసిన ధాన్యంలో తేమ శాతం విషయంలో మిల్లర్లు కొర్రీలతో రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. కూలీలు దొరకకపోవడం, అననుకూల వాతావరణ పరిస్థితుల్లో 70 నుంచి 80 శాతం మంది రైతులు యంత్రాలతోనే నూర్పిళ్లు చేశారు. మాసూళ్లు చేసిన ధాన్యం రాశులు కళ్లాల్లోనూ, రోడ్లపై ఉండగానే అకాల వర్షాలు ముంచెత్తడంతో తడిసి ముద్దయిపోయాయి. అలా తడిసిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే నరకం చూస్తున్నామని రైతులు లబోదిబోమంటున్నారు.

తేమ శాతం 16 లోపు ఉంటేనే..

మంత్రి నాదెండ్ల మాటలు చూస్తే కోటలు దాటిపోతున్నాయి. తేమశాతం 24 ఉన్నా కొనుగోలు చేస్తున్నామని యంత్రాంగం చెబుతోందే తప్ప ఆచరణలో మాత్రం ఎక్కడా ఏ రైతును కదిపినా అమలు కావడం లేదని అంటున్నారు. అసలు తేమ శాతమే తలకుమించిన భారంగా మారిందని చెబుతున్నారు. బరకాలు కప్పి ఎంతో శ్రమకోర్చి ధాన్యాన్ని రక్షించుకున్నా 24 గంటల పాటు నీటిలో తడిసి ఉన్న ధాన్యంలో కూడా తేమ 20 నుంచి 24 శాతం దాటే ఉంటుంది. కాకినాడ రూరల్, కరప, జగ్గంపేట, పిఠాపురం, సామర్లకోట మండలాల్లో కాత్రావులపల్లి, విజయరాయుడుపాలెం, నడకుదురు, పెద్దాపురప్పాడు, తిమ్మాపురం, పనసపాడు తదితర గ్రామాల్లో రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఏ ఒక్క రైతును కదిపినా కనీస మద్దతు ధర కాగితాలకే పరిమితమైందని మండిపడుతున్నారు. కమీషన్ ఏజెంట్ల ద్వారా మిల్లర్లకు తడిసిన ధాన్యాన్ని రూ.1,200 నుంచి రూ.1300కే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కాటాకు తూకం వేసి తీరా మిల్లుకు చేరేటప్పటికీ తేమ శాతం 16 లోపు ఉంటేనే తీసుకుంటున్నారు. అంతకు ఒక్క శాతం మించి ఉన్నా ధాన్యాన్ని వెనక్కు తోలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ మాట దేవుడెరుగు దళారులు కూడా 16శాతం లోపు ఉంటే అసలు ధాన్యం వైపు కన్నెత్తి చూడటం లేదని మదనపడుతున్నారు. కనీసం 20శాతం ఉన్నా తీసుకోమని కోరితే మిల్లర్లు అందుకు కూడా ససేమిరా అంటున్నారు. సీఎమ్ఆర్ ద్వారా 24శాతం అయినా కొంటామంటున్నా అధికారుల మాటలకు వాస్తవ పరిస్థితికి పోలికే లేదని క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటోన్న ఇబ్బందులు పరిశీలిస్తే స్పష్టమవుతోంది. దళారులు 20శాతం దాటి తేమ ఉంటే ప్రతి బస్తాకు నాలుగైదు కేజీలు అదనంగా తూకం వేసుకుపోతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

అధికారులు చెప్పేదానికి క్షేత్ర స్థాయిలో జరుగుతోన్న కొనుగోళ్లకు అసలు పొంతనే కనిపించడం లేదు. జిల్లాలో అకాల వర్షాలతో ఏడువేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్టు అధికారులు చెబుతున్నారు. వివిధ మండలాల నుంచి అందుతోన్న సమాచారాన్ని బట్టి చూస్తే ఇంతకు రెండింతలు ధాన్యం తడిసి ముద్దయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలో 5.27 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని యంత్రాంగం అంచనా వేసింది. ఇంతవరకు ప్రభుత్వం 3.4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. ఇంకా రైతుల వద్ద రోడ్లు, కళ్లాల్లో 2.23 లక్షల టన్నులు ధాన్యం ఉన్నట్టు అంచనా. జిల్లాలో ఏ గ్రామంలో చూసినా, ఏ రైతును కదిలించినా తేమ శాతమే తమను నిలువునా ముంచేస్తోందంటున్నారు. ఇదే కారణంతో రైతులు ప్రతి 75 కేజీల బస్తాకు రూ.500 నష్టపోతున్నాడు.

వారం రోజులైనా కొనే నాథుడు లేడు



ఇతని పేరు పుల్లా శ్రీరాములు (శ్రీను). కాకినాడ రూరల్ మండలం సర్పవరం. రెండున్నర ఎకరాల సొంత పొలంతోపాటు మరో ఎకరం కౌలుకి తీసుకుని రబీ సాగు చేశారు. కోత కోసి నూర్పిడి చేసి వారం రోజులుగా ధాన్యం అమ్ముదామని రోడ్డుపైనే ఆరబెట్టి ఉంచారు. అకాల వర్షాలకు ఇప్పటికే రెండుసార్లు తడిసిపోయింది. రూ.1,725లు కనీస మద్దతు ధర ఇస్తున్నామంటున్నారు. కానీ ఆ రేటుకు ధాన్యం కొన్నవాడు లేడని ఆవేదన చెందుతున్నారు. 20శాతం పైనే తేమ ఉందని ఆయన ధాన్యం కొనుగోలు చేయడం లేదు.

కనికరం లేకుండా కొనుగోలు



ఇతని పేరు మాదాసి సత్యసురేష్. గోకవరం మండలం తంటికొండ గ్రామం. రబీ సీజన్‌లో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి రూ.25 వేలు అయింది. ఈయన సాగు చేసిన మూడెకరాలకు కలిపి 130 కాటాల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి అయిపోయిందని ఇతని ధాన్యాన్ని సీఎంఆర్‌లో కొనకపోవడంతో అధికారులకు చెప్పుకున్నాడు. అయినా స్పందన లేకపోవడంతో గత్యంతరం లేక ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. మొత్తం 130 కాటాలకు ఈ రైతు రూ.39 వేలు నష్ట పోయారు.

ధాన్యం కొనేవారు లేరు



ఇతని పేరు ఎస్.వెంకటేశ్వర్లు. ఇతని స్వగ్రామం సామర్లకోట మండలంలో చంద్రంపాలెం. పంటకోసి, కుప్పనూర్చి ధాన్యం ఒబ్బిడి చేసి ఐదు రోజులు అయ్యింది. ధాన్యం అమ్ముదామంటే కొనుగోలు చేసేవారు లేరని మొత్తుకుంటున్నారు. దళారులకు అమ్ముదామంటే ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉందని బస్తా రూ.1,250కు అడుగుతున్నారు.

తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది



ఇతని పేరు కొప్పన గౌరీశంకర్. కిర్లంపూడి మండలం గోనేడ స్వగ్రామం. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో వరి పంట నీట మునిగింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చే నాథుడే కరువయ్యాడు. 75 కేజీల ధాన్యం బస్తాకు ప్రభుత్వం రూ.1,725 ధరగా చెబుతోంది. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చేసేది లేక రూ.1,200కే దళారులకు అమ్ముకున్నానని కన్నీరు పెట్టుకున్నారు.

కస్టమ్ విధానంలో లోపంతో నష్టపోతున్నాం



ఇతని పేరు మార్ని వెంకట్రావు. పెదపూడి మండల కేంద్రం. నాలుగు ఎకరాలు సాగు చేశారు. ధాన్యాన్ని అమ్మాలంటే ఎక్కడో దూరాన ఉన్న మండలాల్లో మిల్లులు కేటాయిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. తమ మండలంలో ఉన్న మిల్లుకే సీఎంఆర్ కేటాయించి ఉంటే మాకు మద్దతు ధర దక్కేదని అన్నారు. ఇప్పుడు ఎక్కడో దూరంగా ఉండటంతో దళారులకే అమ్ముకుని బస్తాకు రూ.400 నష్టపోతున్నామని అన్నారు.

రత్నగిరి వనదుర్గకు అపచారమా?

ఎన్నడూ లేని విధంగా చండీ, ప్రత్యంగిర హోమాల నిలుపుదల



2024లో జరిగిన సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో మే 23న ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కొన్ని నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. తాజాగా సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో రద్దు చేసిన వైదిక కార్యక్రమాలలో రత్నగిరి వన సంరక్షకురాలు వనదుర్గ అమ్మవారికి శుక్రవారం నిర్వహించే చండీహోమం, పౌర్ణమి రోజు నిర్వహించే ప్రత్యంగిర హోమాలు కూడా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. వాస్తవానికి గతంలో జరిగిన కల్యాణ మహోత్సవాలలో ఈ హోమాలు యథావిధిగా నిర్వహించారు.

కల్యాణోత్సవాల వేడుకలకు ఆటంకం అని కొన్ని వైదిక కార్యక్రమాల రద్దు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు వారం రోజులు జరుగుతాయి. ఈ సందర్భంగా కొన్ని వైదిక కార్యక్రమాలు రద్దు చేస్తారు. రద్దు చేసిన కార్యక్రమాలన్నీ స్వామి, అమ్మవారికి చేసేవే. సత్యదేవుని నిత్యకల్యాణం, ఆయుష్యహోమం, సహస్ర దీపాలంకార సేవ, పంచహారతుల సేవ, పవళింపుసేవ ఉన్నాయి. వీటితో బాటు వనదుర్గ అమ్మవారికి తొమ్మిదో తేదీన నిర్వహించే చండీహోమం, 12వ తేదీన నిర్వహించే ప్రత్యంగిర హోమాలు కూడా నిలిపివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వందేళ్ల క్రితం శృంగేరీ పీఠాధిపతులు అన్నవరంలో రత్నగిరి వనాన్ని రక్షించే దేవతగా వనదుర్గ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి అమ్మవారికి చండీహోమం, ప్రత్యంగిర హోమాలు నిర్వహిస్తున్నారు.

గతంలో హోమాల నిర్వహణ

- 2023లో ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఈఓగా ఉన్నపుడు జరిగిన సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో మే నెల ఐదో తేదీన వైశాఖ పౌర్ణమి, శుక్రవారం రెండూ కలిసి రావడంతో వనదుర్గ అమ్మవారికి చండీ, ప్రత్యంగిర హోమాలు నిర్వహించారు.
- 2024 కల్యాణోత్సవాలలో ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అప్పటి ఈఓగా మే 23న వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. మే 24న వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహించారు.

అయితే ఈ ఉత్సవాలలో చండీహోమం, ప్రత్యంగిర హోమం రద్దు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ హోమాలు నిర్వహించే రుత్విక్కులు, అర్చకులు వేరు. వీరు స్వామివారి ఉత్సవాలలో పాల్గొనరు. హోమాల సమయం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే. స్వామి కల్యాణ వేడుకలన్నీ సాయంత్రం, రాత్రి జరిగేవే. అధికారులు పునరాలోచన చేసి ఆ హోమాలు యథావిధిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఉద్యోగులను మోసం చేసిన చంద్రబాబు



సాయిప్రసాద్

ప్రత్తిపాడు: పరిపాలనానుభవం అపారంగా ఉందని పదే పదే చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలనే కాక ఉద్యోగులను సైతం మోసం చేశారని వైఎస్సార్ సీపీ పెన్షనర్ల వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలకమర్తి సాయి ప్రసాద్ విమర్శించారు. ప్రత్తిపాడులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం మూడు లక్షల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు అనేక హామీలిచ్చిన కూటమి నేతలు గద్దెనెక్కిన తర్వాత హామీలన్నీ గాలికి వదిలేశారన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం రూ. 30 వేల కోట్లు బకాయిలు ఉండగా కేవలం రూ.7,300 కోట్లు విడుదల చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ స్కేలు ఇవ్వాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఖైదీలకు ఈ- ములాఖత్

జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్



కేంద్ర కారాగారాన్ని సందర్శిస్తున్న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): జైళ్ల శాఖలో చేపట్టనున్న సంస్కరణలలో భాగంగా రాష్ట్రంలో ఉన్న జైళ్లలో కృత్రిమ మేధ ఉపయోగించి సిబ్బందిపై ఉన్న ప్రస్తుత పనిభారాన్ని తగ్గించనున్నామని జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఖైదీల బ్యారక్‌లు, ఆరుబయలు జైలు, జైలు ఆవరణలోని వ్యవసాయ క్షేత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కారాగారంలో పనిచేస్తున్న గార్డెనింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకుని సూచనలు చేశారు. 'కృత్రిమ మేధ'' ద్వారా గార్డెనింగ్ సిబ్బంది పై ప్రస్తుతం ఉన్న భారాన్ని తగ్గించి పటిష్టమైన భద్రతాచర్యలు చేపట్టబోతున్నామని తెలిపారు. ఖైదీలు ఈ – ములాఖత్ ద్వారా కారాగారం నుంచి కుటుంబ సభ్యులతో, బంధువులతో నేరుగా వీడియో కాల్ ద్వారా మాట్లాడేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, మునిసిపల్ కమిషనరు కేతన్‌కార్గే ఆయనను కలిశారు. ఆయన వెంట జైళ్ళ శాఖ కోస్తా ప్రాంత ఉప శాఖాధికారి రవి కిరణ్, జైలు సూపరింటెండెంట్ రాహుల్, జైలు అధికారులు ఉన్నారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా రేపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సైంటిఫిక్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంట్, గ్యాలక్సీ హెల్త్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, జేవీఎస్ టెక్నాలజీ, పేటీఎం సంస్థలు 405 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, ఆసక్తి గలవారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 0884-2373270 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఐసెట్‌కు 1,747 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఐసెట్-25 కాకినాడ జిల్లాలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 03 కేంద్రాలతో పాటు ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, అయాన్ ఇనిస్టిట్యూట్, సాఫ్టిక్నాలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 1,904 మంది దరఖాస్తు చేసుకోగా 1,747 మంది హాజరై పరీక్ష రాశారు.

స్వామిపేరు చెప్పి స్వకార్యం

- సౌకర్యాల మాటున స్వలాభం
- వాడపల్లి వెంకన్న క్షేత్రంలో నిబంధనలకు తిలోదకాలు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు



మాడవీధుల్లో చేపడుతున్న నిర్మాణాలు

కొత్తపేట: జిల్లాలోని వాడపల్లి క్షేత్రంలో కూటమి నేతల స్వాహాకారాలు మిన్నంటుతున్నాయి. ఆలయంలో భక్తులకు కల్పించే వసతులు, సౌకర్యాలు, ఫ్లైఓవర్స్, క్యూలైన్లకు సంబంధించి ప్రతి పనిలో అధికారులు నిబంధనలకు తిలోదాలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం నియామకం కాకపోయినా పాలకుల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని చెప్పుకొంటున్న ఒక నాయకుడు అనధికార చైర్మన్‌గా పెత్తనం సాగిస్తున్నాడు. అంతా తన కనుసన్నల్లోనే జరగాలన్నట్టు వ్యవహరిస్తున్నారని, దీంతో అధికారులు సిబ్బంది ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారని స్వయంగా అధికార పార్టీ వారితో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన సుమారు 8 ఎకరాల విస్తీర్ణాన్ని ఎలాంటి అనుమతులు, టెండర్లు లేకుండానే రూ.కోట్ల వ్యయంతో మెరగ చేయిస్తున్నారు. ఫ్లై ఓవర్లు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలకు సంబంధించి నిర్మాణాల్లో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతవరకూ పనిచేసిన తాత్కాలిక ఉద్యోగులను తొలగించి తమ అనుయాయులను పలు పోస్టుల్లో నియమించుకుని ఇష్టానుసారం వేతనాలు ఇస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వర్షాలు వస్తే వాహనాలు దిగబడకుండా

వాహనాల పార్కింగ్ స్థలాన్ని నాలుగు అడుగుల మేర మెరక చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చాక టెండర్లు పిలుస్తాం. వర్షాకాలం సమీపిస్తుండడంతో వాహనాలు దిగబడిపోకుండా గోతులు పూడ్చాలని మండలంలోని ఇసుక ర్యాంపుల వారిని కోరాము. వారు మట్టిని ఉచితంగానే తోలి మెరకకు సాయం చేస్తున్నారు. రెండు ఫ్లైఓవర్‌లలో ఒకటి డోనర్ ఇచ్చిన రూ.ఐదు లక్షలతో నిర్మించగా మరొకటి డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూషన్ మేరకు రూ.6 లక్షలతో నిర్మించినట్టు తెలిపారు. వాడపల్లి క్షేత్రంలో అన్ని పనులు నిబంధనలకు అనుగుణంగానే చేస్తున్నట్టు తెలిపారు.

– నల్లం సూర్య చక్రధరరావు, ఈవో

క్లుప్తంగా

ప్రధానిని కించపరచినందుకు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమరాజు

మామిడికుదురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కించపరుస్తూ అభ్యంతరకర, అనుచిత వ్యాఖ్యలు చేసిన గోగన్నమఠం గ్రామం ముత్యాలపాలేనికి చెందిన కర్రి మోహనకనకదుర్గారావును అరెస్టు చేసినట్టు సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సై ఎ.చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. నగరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టుకు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. సోషల్ మీడియాలో పెట్టే ప్రతి పోస్టుపైన రాష్ట్ర, జిల్లా స్థాయిలో సైబర్ పోలీసుల ఆధ్వర్యంలో ఒక వింగ్ పరిశీలిస్తుందన్నారు. అభ్యంతరకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రధానంగా యువత అప్రమత్తంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, అనుచిత వ్యాఖ్యలు పెట్టకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఆకాశ పందిరిలో..

- వేద ఘోష నడుమ వధూవరులైన సత్యదేవుడు అమ్మవారు
- పట్టువస్త్రాలు సమర్పించిన చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు దంపతులు
- భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికారులు

అన్నవరం: సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి వధూవరులైన శుభ తరుణంలో రత్నగిరి పులకించింది. వారం రోజుల పాటు వైభవంగా సాగనున్న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి, బుధవారం సాయంత్రం పండితులు శ్రీకారం చుట్టారు.

సీతారాములే పెళ్లి పెద్దలుగా...

రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా సత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపం వద్దకు తీసుకువచ్చి చూడముచ్చటైన వేదికపై ప్రతిష్ఠించి వధూవరులుగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా, పండితులు వేదాశీస్సులు ఇచ్చారు.

పసుపు దంచిన ముత్తయిదువులు

వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ తదితరుల ఆధ్వర్యంలో ముత్తయిదువులు పసుపు దంచారు.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

ఈ సందర్భంగా రామరాయ కళావేదికపై రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సత్యదేవుడు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని పండితుల హాస్యోక్తులతో వైభవంగా నిర్వహించారు. స్వామివారే గొప్పవారని అమ్మవారి తరపు వారిని తక్కువ చేసేలా మాట్లాడడం, అమ్మవారి తరపువారు అయ్యవారి తరపువారికి దీటైన బదులివ్వడం చతురోక్తులతో హృద్యంగా నిర్వహించారు.



వధూవరులుగా ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు

నేడు సత్యదేవుని దివ్యకల్యాణం

కాగా, వైశాఖ శుద్ధ ఏకాదశి, గురువారం రాత్రి 9.30 గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవార్ల దివ్యకల్యాణాన్ని వార్షిక కల్యాణవేదికపై ఘనంగా నిర్వహించేందుకు అధికారుల ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తదితర అధికారులను ఆహ్వానించారు.

పటిష్ట ఏర్పాట్లు

స్వామివారి కల్యాణానికి సుమారు 25 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూసేలా వేదిక ముందు టీవీ, స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షింతల ప్యాకెట్లను సర్క్యులర్ మండపంతో పాటు పశ్చిమ రాజగోపురం వద్ద తొమ్మిది చోట్ల పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన భవనంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కొండ మీదకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఉచిత బస్సులను కొండమీదకు నడుపుతున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీటి సరఫరాకు వలంటీర్లు, సేవా కార్యకర్తలను ఏర్పాటు చేశారు. వీఐపీలు, మహిళలు, భక్తులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తునికి చెందిన అగ్ని మాపక శకటాన్ని ఏర్పాటు చేశారు.



పసుపు దంచుతున్న ముత్తయిదువలు



కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు



అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, 8 గంటలకు చతుర్వేదపారాయణ, 9 అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, దీక్షా వస్త్ర ధారణ. రాత్రి 7 గంటలకు కొండ దిగువన స్వామివారిని వెండి గరుడ వాహనంపై, అమ్మవారిని వెండి గజవాహనంపై, పెళ్లిపెద్దలైన సీతారాములను వెండి పల్లకీపై ఊరేగింపు. అలాగే రాత్రి 9 గంటలకు రత్నగిరి కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అలాగే రత్నగిరి కళావేదికపై, కొండదిగువన ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా కాకినాడ, జగ్గంపేట, కోనసీమలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ బుధవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా అన్‌లైన్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థి చేరదలచుకున్న ఐటీఐ కళాశాలను అన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ, కోనసీమ జిల్లా అభ్యర్థులు అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఏమైనా సందేహాలుంటే 0884–2348182 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తాండవలో మహిళ మృతదేహం



తాండవ నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

తుని: స్థానిక కత్రాకొండ పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్ పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై విజయ్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం స్థానికులు మృతదేహన్ని చూసి పోలీసులకు సమచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మృతదేహన్ని బయటకు తీశారు. మృతురాలి వయస్సు (50) ఉంటుందని, నీలంరంగు చీర ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలియలేదని, తెలిస్తే తుని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పాపేం చేసింది పాపం!

- ఆడపిల్ల అనా లేక అడ్డుగా ఉందనా!
- సంచలనం రేపిన పసికందు మృతి
- ఘటనపై ఎన్నో అనుమానాలు
- కేసును పక్కదోవ పట్టించేందుకే క్షుద్రపూజల నాటకమా?





బాలిక మృతదేహం లభ్యమైన బావి. (అంతర చిత్రం) మృతి చెందిన బాలిక యశ్వంతి (ఫైల్)

పిఠాపురం: అన్నెంపుణ్యం తెలియని పసిగుడ్డును పొట్టన పెట్టుకున్నారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న పసికందు మృతి, క్షుద్ర పూజల ఆనవాళ్లు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురం జగ్గయ్య చెరువులో నివాసముంటున్న పెదపాటి సతీష్, శైలజ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి యశ్వంతి అనే ఆరునెలల పాప ఉంది. మంగళవారం రాత్రి శైలజ పెద్దమ్మ గంటా మరిడమ్మ పెదనాన్న గంటా రాంబాబులు మేడపై నిద్రించారు. తమ్ముడు పసుపులేటి లోవరాజు, తండ్రి పసుపులేటి దుర్గారావు, తల్లి అన్నవరంలతో కలిసి శైలజ, ఆమె కుమార్తె యశ్వంతి (6 నెలలు) కింద గదులలో నిద్రించారు. రాత్రి 12.30 గంటల సమయంలో పాపకు పాలిద్దామని చూసిన శైలజకు చిన్నారి కనపడకపోవడంతో పెద్దగా కేకలు వేసింది. దీంతో ఇంట్లోని వారందరూ, పక్కింటి వారు కూడా వచ్చి పాప కోసం ఇల్లంతా వెదికారు. చివరకు వారు బావిలో పడి ఉన్న పాపను, ఇంటి గుమ్మం మెట్లపై ఉన్న నిమ్మకాయ, పసుపు, కుంకాలను గమనించారు.

ఘోరానికి ఒడిగట్టిందెవరు..!

ఈ విషయాన్ని బంధువులకు చెప్పేందుకు శైలజ తల్లి అన్నవరం తన సెల్ కోసం వెతికి అది కనిపించకపోవడంతో వేరొక సెల్ నుంచి తన మొబైల్‌కు ఫోన్ చేశారు. ఆ ఫోన్ ఇంటి గోడ అవతల రింగ్ అవుతూ కనిపించింది. దానిని తీసుకుని బంధువులకు విషయాన్ని తెలియజేశారు. సమాచారం అందుకుని అక్కడ చేరుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బావిలోని పాప మృతదేహాన్ని బయటకు తీసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేశారు. పాప అమ్మమ్మ అన్నవరం వద్దకు వెళ్లి నిలవడంతో పాటు ఆమె ఫోన్ నూతి పక్కన దొరకడం అనుమానాలకు తావిచ్చింది. దీంతో పోలీసులు అన్నవరంను, ఆమెతో పాటు, కొందరు కుటుంబ సభ్యులను అనుమానితులుగా విచారిస్తున్నారు. శైలజ యానాదులు కాగా తండ్రి సతీష్ ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన వారని స్థానికులు తెలిపారు. వీరి ప్రేమ వివాహం నచ్చని శైలజ కుటుంబ సభ్యులు బాలిక మృతికి కారణమై ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్



ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్

క్షుద్ర పూజలు నాటకమేనా

ఆడ పిల్ల అనో, లేక అడ్డుగా ఉందనో పసికందును పొట్టన పెట్టుకున్న అగంతకులు ఎవరికీ అనుమానం రాకుండా క్షుద్ర పూజలు జరిగినట్లు చిత్రీకరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. కుంకుమ, పసుపు నమూనాలు సేకరించి, ఇంటిలో ఉన్న పసుపు కుంకుమ ఒకటేనా అని పరిశీలించారు. కేసును తప్పుదోవ పట్టించడానికే క్షుద్ర పూజల నాటకం ఆడి ఉంటారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి అమ్మమ్మ, తాతయ్య, మేనమామ, తండ్రి తదితరులను అనుమానితులుగా విచారిస్తున్నారు.

బంతితో ఆడుతూ బావిలోకి..

- ఏడేళ్ల బాలుడి మృతి
- అయోధ్యరామపురంలో విషాదం

సామర్లకోట: బంతితో ఆడుతూ పొరపాటు బావిలో పడి ఒక చిన్నారి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం అయోధ్యరామపురానికి చెందిన చెవా హేమంత్ (7) బుధవారం సాయంత్రం తన ఇంటి సమీపంలో బంధువుల ఇంటి వద్ద బంతితో ఆడుతూ బావి సమీపంలోని సిమెంటు దిమ్మ ఎక్కాడు. బంతి బావి వైపు పోవడంతో దానిని అందుకునే క్రమంలో ఆ చిన్నారి బావిలో పడిపోయాడు. సుమారు 60 అడుగుల లోతులో బావి ఉండడంతో స్థానికులు దిగలేకపోయారు. దాంతో విద్యాకమిటీ చైర్మన్ నక్కా జానికిరామయ్య పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది బావిలోనికి దిగే ప్రయత్నం చేశారు. అయితే వారి వద్ద లైట్ లేక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు లైట్ ఏర్పాటు చేయడంతో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు బావిలోనికి దిగారు. బాలుడు బావిలోనికి పడిన సమయంలో అతని తలకు గాయం తగలడం, సుమారు రెండు గంటల సేపు బావిలో ఉండిపోవడంతో మృతి చెందాడు. బాలుడి తండ్రి సతీష్ ఏడీబీ రోడ్డులోని ఒక రెయ్యల చెరువు వద్ద పని చేస్తూ ఉంటాడు. తల్లి రాధ గృహిణి. హేమంత్ తాత సుబ్బారావు సాయంత్రం 6 గంటల సమయంలో ముంజులు తీసుకు వచ్చి తినరా అంటే ఇప్పుడే రెండు నిమిషాలల్లో వస్తానని చెప్పి వెళ్లిన మనవడు ఐదు నిమిషాలలో బావిలో పడిపోయాడనే వార్త వినాల్సి వచ్చిందని గుండెలు బాదుకుంటూ రోదించాడు. ఎస్సై మూర్తి తన సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బావిలో పడి మృతి చెందిన హేమంత్

ఈజీ మనీ కోసం వ్యసనాల బాట

- దొంగతనం కేసులో ఐదుగురి అరెస్టు

రాయవరం: చెడు వ్యసనాలకు బానిసలైన యువకులు ఈజీ మనీ కోసం దొంగతనాల బాట పట్టి జైలుపాలయ్యారు. అయినా వారిలో మార్పు రాలేదు. జైలులో ఏర్పడిన పరిచయాలతో ముఠాగా ఏర్పడి తిరిగి దొంగతనాలకు పాల్పడి స్థానిక పోలీసులకు చిక్కారు. ఎస్సై డి.సురేష్‌బాబు బుధవారం తెలిపిన వివరాల మేరకు. రాయవరానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ శెట్టి చిన్నికృష్ణ గత నెల 30న రామచంద్రపురం ఎల్ఐసీ కార్యాలయానికి బయలుదేరాడు. పసలపూడి వంతెన వద్దకు వచ్చే సరికి బండి పెట్రోల్ ట్యాంకుపై పెట్టుకున్న బ్యాగ్‌ను మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఆ బ్యాగ్‌లో రూ.70వేల నగదు, ఎల్ఐసీ బ్యాండు పేపర్లు, ఐడీ కార్డు జెరాక్సులు ఉన్నాయి. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్సై సురేష్‌బాబు విచారణ చేపట్టి పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు బీసీ కాలనీకి చెందిన దత్తు అలియాస్ దత్తి నవీన్ (ప్రస్తుతం ఏలూరు పట్టణంలో తంగెల్లముని వాసి), ఏలూరు పట్టణం జేవీఆర్ నగర్, గవరవరానికి చెందిన కోనాల రవితేజ, అనపర్తి మండలం పాలమూరు గ్రామంలోని మహేంద్రవాడరోడ్‌కు చెందిన నల్లమిల్లి ఆదిత్యరెడ్డి, ఏలూరు పట్టణం ఫిరంగుల దిబ్బ, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన దండూరి సాయిరాజు, అదే ప్రాంతానికి చెందిన నడుపూరు కల్యాణ్‌లను నిందితులుగా గుర్తించారు. లొల్ల గ్రామంలోని వెంకటేశ్వర బ్రిక్స్ ఇండస్ట్రీ ఎదురుగా కుతుకులూరు నుంచి లొల్ల వచ్చే రహదారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై వస్తూ పోలీసులకు చిక్కారు. వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, రూ.54 వేల నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, హెచ్‌సీ సత్యకుమార్, పీసీలు వీరేంద్ర, విజయ్, సత్యకుమార్‌లను ఎస్పీ కృష్ణారావు అభినందించినట్లు ఆయన తెలిపారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ఓపెన్ స్కూల్ సంచాలకుడు ఆర్.నరసింహారావు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

పరీక్షలు ఇలా..

తేదీ	పదవ తరగతి	ఇంటర్
మే 19	హిందీ	ఇంగ్లిషు
మే 20	ఇంగ్లిషు	హిందీ, తెలుగు, ఉర్దూ
మే 21	తెలుగు, ఉర్దూ, కన్నడ ఒరియా, తమిళం	కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సామాజికశాస్త్రం
మే 22	గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం	ఫిజిక్స్, సివిక్స్/పౌరశాస్త్రం మనో విజ్ఞానశాస్త్రం
మే 23	శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం.	గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం
మే 24	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	జీవశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం

గోమాతలో క్షీరసాగరం!

- అధిక పాలనిచ్చి అబ్బురపరచిన ఆవు
- రోజుకు 21.19 లీటర్లు పాల దిగుబడి



ఆవుతో మురళీకృష్ణ. (అంతర చిత్రం) 11.52 లీటర్లు తూగిన ఉదయం ఇచ్చిన పాలు

కపిలేశ్వరపురం (మండపేట): సాధారణంగా స్వదేశీ ఒంగోలు ఆవు ఉదయం, సాయంత్రం నాలుగు లీటర్ల చొప్పున రోజుకు సుమారుగా 8 లీటర్ల పాలని స్తాయి. దానికి భిన్నంగా మండపేట పట్టణానికి చెందిన పాడి రైతు వేగుళ్ల మురళీకృష్ణ సంరక్షణలోని ఒంగోలు జాతి పాడి ఆవు రోజుకు ఏకంగా 21.19 లీటర్లు పాలనిచ్చింది. ఆ విషయాన్ని మండపేటలోని కేంద్రీయ పశు నమోదు పథకం స్టాక్‌మేన్ డి.రాజేశ్వరావు నిర్ధారించారు. ఆయన పర్యవేక్షణలో మంగళవారం ఆవు నుంచి పాలను పితకగా ఉదయం 11.52 లీటర్లు, సాయంత్రం 9.67 లీటర్లు మొత్తం 21.19 లీటర్లు పాల ఇచ్చింది. ఈ స్థాయిలో పాలనివ్వడం ప్రత్యేకత కలిగినదేనని రాజేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది జనవరిలో రాజోలు సమీపంలో నిర్వహించిన పాల పోటీల్లో మొదటి బహుమతి పొందిన ఆవు 18 లీటర్లు, ద్వితీయ బహుమతి పొందిన ఆవు 16 లీటర్లు పాలు ఇచ్చాయన్నారు. వాటన్నింటి రికార్డులను చెరిపేస్తూ మండపేటలోని ఈ ఆవు 21.19 లీటర్లు పాలనిచ్చింది.

రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ పోర్టుకు తరలిస్తున్న సుమారు 28.6 టన్నుల రేషన్ బియ్యాన్ని ఏపీ 39 యూడీ 6507 లారీపై తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో తమ్మయ్యపేట జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. లారీ ప్రయాణిస్తున్న నల్లజర్లకు చెందిన వినాయక ట్రేడర్స్ ప్రతినిధి మద్దు సత్యనారాయణ మూర్తి, లారీ డ్రైవర్ గొలుసు శంకరరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. నిల్వ విలువ రూ.29 లక్షలు ఉంటుందన్నారు.


చిత్రం మనోహరం!

- పెన్సిల్ ఆర్ట్‌లో అందెవేసిన చేయి
- చూసిన దృశ్యాన్ని పేపర్‌పై పెట్టే నేర్పు
- చిత్రకళతో ఆకట్టుకుంటున్న వైనం

పిఠాపురం: చూసిన దృశ్యాన్ని, అంశాన్ని మనోఫలకంపై బంధించి కాన్వాసుపై గీయడంలో నేర్పరి ఈ బాలుడు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న బొమ్మలను సరదాగా గీయడంతో అలవాటైన చిత్రకళను సాధనతో పరిపుష్టం చేసుకున్నాడు అతడు. ప్రొఫెషనల్ చిత్రకారుడిగా గుర్తింపు పొందడమే లక్ష్యమంటున్న కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన పట్నాల వెంకట శ్రీసాయి మనోహర్ ఈ చిత్రకళలో ఎన్నో షీల్డులు గెలుచుకుంటున్నాడు. అదీ ఇదీ అనికాదు.. దేశ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులు, దేవతామూర్తులు ఇలా ఏది చూసినా ఇట్టే పేపర్‌పై గీసే నైపుణ్యం సాధించాడు. పటాన్నల ఈశ్వరరావు, వీర వెంకటలక్ష్మి దంపతుల కుమారుడైన మనోహర్ ఆరో తరగతి నుంచి ప్రారంభించిన అభ్యాసం ప్రస్తుతం 9వ తరగతిలోకి అడుగుపెట్టడం వరకు మరింత తన కళకు సానబట్టాడు.



మనోహర్ సాధించిన ప్రశంసాపత్రాలు, షీల్డులు



మాతో పెట్టుకుంటే రక్త సిందూరమే (పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడికి నిదర్శనంగా మనోహర్ గీసిన చిత్రం)



పెన్సిల్‌తో మనోహర్ గీసిన అయోధ్య రాముని చిత్రం

పెదనాన్న గీసిన డిజైన్లు చూసి

మాది వడ్రంగి కుటుంబం. మా పెదనాన్న పట్నాల సీతాంబరం, మానాన్న పట్నాల ఈశ్వరరావు చేతితోనే డిజైన్లు చెక్కేవారు. కాగితంపై వారు గీచిన డిజైన్‌ను చెక్కపై అతికించి తదనుగుణంగా వుడ్ వర్క్ చేసేవారు. వారి పనితనం చూసి ఆసక్తి కలిగి ఈ కళను నేర్చుకున్నాను. ప్రముఖ చిత్రకళాకారులు, వారి చిత్రాలను పలు పుస్తకాల ద్వారా తెలుసుకున్నాను. కేవలం పెన్సిల్ తోనే చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్నా. అవసరమైతే తప్ప రంగులద్దను. నేను గీసిన చిత్రాలకు ఎన్నో ప్రశంసలు, బహుమతులు వచ్చాయి. యూట్యూబ్‌లో ఒక చిత్రకారుడు ఎదురుగా ఉన్న మనిషిని అక్కడికక్కడే బొమ్మ గీసి ఇవ్వడం చూసి నేనూ సాధన చేశారు. తక్కువ సమయంలో ఎదుటి దృశ్యాన్ని గీయడానికి సాధన చేస్తున్నా. మంచి చిత్రకారుడిగా పేరు పొందాలని, డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరి అందరికి చిత్రలేఖనంపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– పట్నాల వెంకట శ్రీసాయి మనోహర్

